
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 శ్రీకాకుళం జిల్లా వార్తలు
శనివారం 20 ఏప్రిల్ 2024

వణికిస్తున్న వంతెన

నాగావళి నదిపై 1959-1963లో బూర్జ మండలం నారాయణపురం, సంతకవిటి మండలం రంగరాయపురం గ్రామాల మధ్య నారాయణపురం ఆనకట్టను నిర్మించారు. ఇందులో భాగంగా ఎచ్చెర్ల మండలం వరకు కాలువను తవ్వారు. దుప్పలవలస గ్రామానికి వెళ్లే దారిలో నారాయణపురం కాలువకు ఓ వంతెన నిర్మించారు. అప్పట్లో అతి కొద్దిమంది మాత్రమే ఈ వంతెనపై రాకపోకలు సాగించేవారు. నేడు ఈ వంతెన ఆవశ్యకత బాగా పెరిగింది. దుప్పలవలస, అర్బన్ హౌసింగ్, డోలవానిపేట, బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థులు ఈ వంతెనపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అర్బన్ హౌసింగ్‌లో ఐదారు వందల మంది ప్రజలు ఉన్నారు. డోలవానిపేట, దుప్పలవలస ప్రజలు కూడా ఈ వంతెనపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



- అభివృద్ధికి ఆమడ దూరం
- నియోజకవర్గమంతటా సమస్యలే
- ప్రతి మండలంలోనూ ప్రజలకు అవస్థలే
- పరిశ్రమలు ఉన్నా.. స్థానికులకు ఉపాధి కరువే
- కాలువలున్నా సాగునీటికీ ఇబ్బందులే
- అమలుకాని వైసీపీ ఎన్నికల హామీలు

అయ్యో.. ఎచ్చెర్ల


దుప్పలవలస వద్ద కూలడానికి సిద్ధంగా ఉన్న వంతెన

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఆ నియోజకవర్గం జిల్లాలో ప్రత్యేకం. సిక్కోలులో ఉన్నా.. లోక్‌సభ నియోజకవర్గం మాత్రం పక్క జిల్లా విజయనగరం పరిధిలోకి వస్తుంది. మరోవైపు పారిశ్రామిక వాడ నియోజకవర్గంగా ప్రసిద్ధి చెందింది. భారీ పరిశ్రమలు, కార్పొరేట్ కంపెనీలు ఈ నియోజకవర్గంలోనే అత్యధికంగా ఉన్నాయి. కాగా.. ప్రగతి మాత్రం ఆశించినస్థాయిలో లేదు. ఇదీ జిల్లా ముఖద్వారమైన ఎచ్చెర్ల నియోజకవర్గ దుస్థితి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ నియోజకవర్గమంతా సమస్యల మయమే. ఓ వైపు నారాయణపురం, తోటపల్లి కాలువలున్నా రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పవు. మరోవైపు పరిశ్రమలు ఉన్నా స్థానికులకు ఉపాధి కరువే. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పరిశ్రమలోనూ స్థానికులకు 75 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని జీవో తెచ్చారు. కానీ, ఆ జీవో మాత్రం అమలైన దాఖలాలు లేవు. గత ఎన్నికల సమయంలో వైసీపీ నేతలు ఇచ్చిన హామీ లేవీ అమలు చేయకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి ఎన్నికల్లో అభివృద్ధి చేసే నాయకుడినే ఎన్నుకోవాలని నియోజకవర్గ ప్రజలంతా భావిస్తున్నారు. వైసీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.

ఎచ్చెర్ల మండలం...

- నియోజకవర్గంలో సమస్యలను పరిశీలిస్తే.. ఎచ్చెర్ల మండలంలో ప్రధాన సాగునీటి వనరు నారాయణపురం కుడికాలువ ఉంది. ఈ కాలువకు దశాబ్దాలుగా ఆధునికీకరణ పనులు చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వం కాలువ నిర్వహణకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.
- తమ్మినాయుడుపేట, పొన్నాడ గ్రామాలు నాగావళి నదికి ఆనుకుని ఉన్నాయి. వరదల సమయంలో ఈ గ్రామాల్లోని భూములు తరచూ కోతకు గురవుతున్నాయి. కరకట్టలు నిర్మిస్తామని పలు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేరలేదు.
- తోటపాలెం నుంచి కొత్తపేట మీదుగా సంతసీతారాంపురం వెళ్లే రహదారిలో పెద్దపెద్ద గోతులు ఏర్పడి అధ్వానంగా మారింది. ప్రజలు రాకపోకలు చేసేందుకు నరకయాతన పడుతున్నారు.


నవభారత్ జంక్షన్ వద్ద అధ్వానంగా నారాయణపురం కాలువ

లావేరు మండలం...

- లావేరు మండలం బుడుమూరులోని నారాయణసాగరం పెద్ద చెరువును మినీ జలాశయంగా అభివృద్ధి చేస్తే మండల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నేతలు ప్రతిసారీ హామీలు ఇస్తున్నారే తప్ప పనుల్లో కదలిక లేదు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం సైతం ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు.



రణస్థలంలో తోటపల్లి కాలువ దుస్థితి ఇలా..

- లావేరు మండలం బుడుమూరు పెద్దగెడ్డపై అదపాక, గుర్రాలపాలెం గ్రామాల మధ్య నేతేరు, లక్ష్మీపురం గ్రామాల సమీపంలో ఉన్న కాజ్‌వేలు శిథిలమయ్యాయి. దీంతో వీటి మీదుగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటి స్థానాల్లో వంతెనలు నిర్మించాల్సి ఉన్నా నేతలు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.
- లావేరు మండలం వేణుగోపాలపురం, నాగంపాలెం, తాళ్లవలస, గుమ్మడాం, రణస్థలం తదితర గ్రామాలకు వెళ్లే మట్టిరోడ్డులు అధ్వానంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీటిని బీటీ రోడ్డులుగా మారుస్తామని ఎన్నికల సమయంలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నీటి మీద రాతల్లా మారాయి. కనీసం కంకర సైతం వేయలేదు.

రణస్థలం మండలం

తోటపల్లి ప్రాజెక్టు ద్వారా మండలంలోని ఆయకట్టు మొత్తానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని గత ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు కనీసం చర్యలు చేపట్టలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన సాగునీరు సైతం ప్రస్తుతం పొలాలకు అందడం లేదు.

- రణస్థలం మండలంలోని పరిశ్రమల్లో అర్హులైన స్థానిక యువకులకు ఉద్యోగాలిప్పిస్తామని పరిశ్రమల ఏర్పాటు సమయంలో కంపెనీల ప్రతినిధులు పేర్కొన్నారు. ఒక్కరికీ ఉద్యోగమిచ్చిన దాఖలాలు లేవు. దీంతో స్థానిక యువత ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి. ప్రభుత్వాలు సైతం ఈ విషయాన్ని కనీసం పట్టించుకోవడంలేదు.
- రణస్థలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. మండలంలోని యువత డిగ్రీ చది వేందుకు శ్రీకాకుళం నగరం, సమీప పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. పలువురు బాలి కలు ఇంటర్ తర్వాత చదువుకు దూరమవుతున్నారు. కళాశాల ఏర్పాటు చేస్తే యువతకు ఉపయోగకరంగా ఉంటుంది.

జి.సిగడాం మండలం

- జి.సిగడాం మండలంలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణం కలగానే మిగులుతోంది. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బొత్స సత్యనారాయణ జి.సిగడాంలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేశారు. దీని నిర్మాణంపై మండల ప్రజలు ప్రస్తుత ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. మండలంలో అగ్ని ప్రమాదాలు జరిగితే రాజాం, పొందూరు అగ్నిమాపక కేంద్రాలపై ఆధార పడాల్సి వస్తోంది.
- జి.సిగడాం మండలంలో మద్దువలస, తోటపల్లి కాలువల ద్వారా సాగునీరు శివారు గ్రామాలకు అందడం లేదు. ఏటా రైతులు పంట నష్టపోవాల్సి వస్తోంది. మద్దువలస, తోటపల్లి పిల్ల కాలువల ద్వారా మండలంలో బాతువ, గెడ్డకంచరాం, పెసాం, ఎందువ, నడిమివలస, సేతుభీమవరం, నిద్దాం, పాలకండ్యాం, వాండ్రంగి తదితర గ్రామాల్లో సుమారు 12వేల ఎకరాల వరకు పంటలు పండిస్తున్నారు. కాలువల నిర్మాణాలు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు.
- జి.సిగడాం మండలంలో పెంట, నిద్దాం, ఎస్‌పీఆర్ పురం, నక్కపేట, గొలుసుపూడి తదితర గ్రామాల్లో రహదారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎమ్మెల్యే రహదారుల మరమ్మతులకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినా ఇంతవరకు పట్టించుకోలేదు.



ఐదేళ్లుగా సాగునీరు లేదు

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తోటపల్లి కాలువ నుంచి పుష్కలంగా నీరు వచ్చేది. ఏడాదికి మూడు పంటలు పండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఐదేళ్లుగా తోటపల్లి కాలువ ద్వారా సాగునీరందని దుస్థితి నెలకొంది. దీంతో పంటలు నష్టపోతున్నాం.

- దన్నాన సత్తిబాబు, కొండములగాం, రణస్థలం



కాలవ పనులు పూర్తి కాలేదు

వైసీపీ పాలనలో రైతులు పూర్తిగా నష్టపోయారు. గతంలో తోటపల్లి నీరుతో రైతులు బాగా పంటలు పండించేవారు. ప్రస్తుతం చీపురుపల్లి వరకు వస్తున్న తోటపల్లి కాలువ నీరు రణస్థలం వరకు ఎందుకు రావడం లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తోటపల్లి కాలువ పనులు పూర్తికాలేదు. శివారు ప్రాంతాలకు నీరు వెళ్లడం లేదు. తోటపల్లి నీరు వస్తే చెరువులు నిండేవి. భూగర్భ జలాలు పుష్కలంగా ఉండేవి.

-కెల్ల హేమంతుకుమార్, రణస్థలం



ఆధునికీకరణ పనులేవీ

టీడీపీ ప్రభుత్వ హయాంలో జైకా నిధులతో నారాయణపురం ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ పనులు పూర్తికాలేదు. దీంతో ఆయకట్టు రైతులకు కష్టాలు తప్పడంలేదు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు లో జాప్యం కారణంగా ఆధునికీకరణ పనులు 50 శాతం కూడా పూర్తికాలేదు.

-నక్క లక్ష్మణరావు, చినకొంగరాం, ఎచ్చెర్ల



సిబ్బంది లేక సమస్యలు

నారాయణపురం ఆనకట్ట ద్వారా సాగునీరు అందించే కింతలి సెక్షన్‌కు సిబ్బంది కూడా తగినంత లేరు. గతంలో కుశాలపురం పరిధిలో ఈ కార్యాలయం ఉండేది. సాగునీరు ముందుకు సాగేందుకు ప్రాధానంగా ఉండాల్సిన లస్కర్లను కూడా ప్రభుత్వం నియమించలేదు. కాలువ నిర్వహణ సరిగా లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయ పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉంది

-బాన్న వెంకటరావు, ధర్మవరం, ఎచ్చెర్ల



సాగునీరు అందక అవస్థలు

తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు అందక అవస్థలు పడుతున్నాం. గ్రామం పైనుంచి ప్రధాన కాలువ ఉన్నా.. పిల్ల కాలువలు లేక సాగునీరు అందడం లేదు. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. పిల్ల కాలువలు తవ్వించి సాగునీరు అందించాలి

-రెడ్డి నీలంనాయుడు, రైతు, బాతువ, జి.సిగడాం



మదుములు ఏర్పాటు చేయాలి

తోటపల్లి ప్రధాన కాలువకు మదుములు ఏర్పాటు చేసి వాటి ద్వారా సాగునీటి చెరువులకు నీటిని మళ్లించాలి. చెరువుల్లో లో నీటిని నిల్వ ఉంచటం వలన వర్షాభావ సమయంలో పంటలకు సాగునీరు అందుతుంది. తోటపల్లి కాలువ నుంచి నీరు రాకపోవటంతో పొట్ట దశలో పంటలు ఎండిపోయి.. నష్టపోతున్నాం.

-కూనుబిల్లి అప్పలనాయుడు, రైతు, బాతువ, జి.సిగడాం

కాంగ్రెస్ ప్రచార వాహనంపై వైసీపీ శ్రేణుల దాడి

టెక్కలిలో దువ్వాడ నామినేషన్‌కు వివిధ ప్రాంతాల నుంచి హాజరైన వైసీపీ కార్యకర్తలు.. స్థానిక రవీంద్రభారతి పాఠశాల సమీపంలో కాంగ్రెస్ ప్రచార వాహనంపై దాడికి పాల్పడ్డారు. ఆటోపై ఉన్న కృపారాణి ఫ్లెక్సీలను చించివేశారు. దీంతో ఆటోడ్రైవర్ ఆటోను నిలిపేసి పరుగులు తీశారు. కృపారాణి ఇటీవల వైసీపీని వీడి.. టెక్కలి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తుండడంతో పలువురు వైసీపీ కార్యకర్తలు జీర్ణించుకోలేక ఈ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కృపారాణి అనుచరులు శుక్రవారం రాత్రి టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓటమికి భయపడి వైసీపీ శ్రేణులు ఈచర్యలకు పాల్పడు తున్నారని డీసీసీ అధ్యక్షుడు పరమేశ్వరరావు ఆరోపించారు.



మందుబాబుల హల్‌చల్

దువ్వాడ శ్రీనివాస్ నామినేషన్ సందర్భంగా టెక్కలిలో నిర్వహించిన ర్యాలీలో మందుబాబులు సందడి చేశారు. వైసీపీ కార్యకర్తలు మద్యం దుకాణాల వద్ద కిక్కిరిసి కనిపించారు. ఓ వైపు నామినేషన్‌కు సంబంధించిన సభ అంబేడ్కర్ జంక్షన్ వద్ద జరుగుతుండగానే.. కొంతమంది మద్యం దుకాణాలకు తరలిపోయారు. అలాగే టెక్కలి మేజర్ పంచాయతీలో మహిళలు కూడా నామినేషన్ ర్యాలీకి తరలి వచ్చేలా వైసీపీ నేతలు డబ్బులు పంపిణీ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.


టెక్కలిలో వైసీపీ ర్యాలీలో మందుబాబుల సందడి

దువ్వాడపై ఆరు కేసులు

- ఆంధ్రాలో నాలుగు, ఒడిశాలో రెండు
- వీటితోపాటు ఒడిశా ఐటీ, కమర్షియల్ ట్యాక్స్‌కు సంబంధించి మరో రెండు..
- ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన శ్రీనివాస్

టెక్కలి, ఏప్రిల్ 19: టెక్కలి వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై ఆరు కేసులు ఉన్నాయి. శుక్రవారం నామినేషన్ సందర్భంగా టెక్కలిలో రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో తనపై ఆంధ్రాలో నాలుగు కేసులు, ఒడిశాలో రెండు కేసులు ఉన్నట్లు దువ్వాడ వెల్లడించారు. ఈ కేసులన్నీ విచారణలో ఉన్నాయి. 2011 నౌపడా పోలీస్‌స్టేషన్‌లో ప్రభుత్వ అధికారులపై దురుసుగా ప్రవర్తించినందుకు కేసు నమోదు కాగా, 2018లో పోలీసులు చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. ప్రభుత్వ ఉద్యో గులను అవమానించడం, బెదిరించడం వంటి సంఘటనలకు సంబంధించి 2011లో సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో కేసు నమోదు కాగా 2019లో చార్జ్‌షీట్ నమోదు చేశారు. 2011 నౌపడా పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రభుత్వ అధికారులపై దురుసుగా ప్రవర్తించినందుకు మరో కేసు నమోదుకాగా, 2020లో చార్జ్‌షీట్ వేశారు. నౌపడా పోలీస్‌స్టేషన్ పరిధిలో 2011లో ప్రభుత్వ ఉద్యోగులను గాయపరిచినందుకు మరో కేసు నమోదుకాగా ఇది కోటబొమ్మాళి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పరిధిలో 2017లో చార్జ్‌షీట్ వేశారు.

- ఇక ఒడిశాలోని గజపతి జిల్లా పర్లాఖిమిడిలో 2010లో గనులు, భూగర్భశాఖకు పన్నులు ఎగవేయడంతో ఈ కేసు పర్లాఖిమిడి కోర్టులో నడుస్తోంది. విజిలెన్స్ జడ్జి, బరంపురం కోర్టు నందు 2012లో ప్రోపర్టీస్ చీటింగ్‌పై మరోకేసు నమోదైంది. ఈ ఆరు కేసులు విచారణలో ఉన్నట్లు వెల్లడించారు. ఒడిశాలో ఐటీకి సంబంధించి రూ.18లక్షల బకాయిపై ఓ కేసు ఉందని, అలాగే కమర్షియల్ ట్యాక్స్‌కు సంబంధించి రూ.16.86లక్షల చెల్లింపులకు సంబంధించి మరో కేసు ఉందని తెలిపారు.
- తన చేతిలో నగదు రూ.15లక్షలు ఉందని, నరసన్నపేట యాక్సిక్ బ్యాంక్‌లో రూ.1.22 లక్షలు, టెక్కలి బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.76.47లక్షలు, టెక్కలి ఎస్‌బీఐలో రూ.64లక్షల వరకు ఉందని తదితర ఆస్తుల వివరాలను దువ్వాడ వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా డైడిగాం వద్ద 45 సెంట్ల ప్లాటు, 72సెంట్ల ప్లాటు ఉన్నాయని తెలిపారు. వెంకటేశ్వర కాలనీలో రూ.29లక్షలు విలువైన ఇల్లు, శ్యామసుందరాపురంలో రూ.25 లక్షలు విలువచేసే రెండు ఇళ్లు ఉన్నాయని, ప్రస్తుతం తాను టెక్కలి సమీపంలో రూ.2కోట్లతో ఇల్లు నిర్మిస్తున్నానని తెలిపారు. అప్పులను కూడా అఫిడవిట్‌లో వివరించారు.


పాతపట్నం : ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ


పలాస : నామినేషన్ వేస్తున్న గౌతు శిరీష


ఆమదాలవలస : నామినేషన్ వేస్తున్న కూన రవి


పాతపట్నం: నామినేషన్ వేస్తున్న మామిడి గోవిందరావు

నామినేషన్ల సందడి

- రెండో రోజూ ఎంపీ స్థానానికి 4..
- అసెంబ్లీ స్థానాలకు 16 దాఖలు


(శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి/ పలాస/ ఆమదాలవలస/ పాతపట్నం/ టెక్కలి)

జిల్లాలో రెండో రోజు శుక్రవారం నామినేషన్ల సందడి పెరిగింది. శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి 4, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 16 నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం టీడీపీ, వైసీపీ అభ్యర్థులతోపాటుగా ఇతర పార్టీల అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు.

- శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గానికి వైసీపీ నుంచి పేరాడ తిలక్ రెండు సెట్ల నామినేషన్ వేశారు. తన పేరిట రూ.51,47,672, భార్యపేరిట రూ. 89,72,658, ఇద్దరి కుటుంబ సభ్యుల పేర్లతో రూ.15.64లక్షల చరాస్తులున్నట్టు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. స్థిరాస్తులు.. తన పేరిట రూ.9,34,19,600, భార్య పేరిట రూ.1,84,73,000 ఉన్నట్టు తెలిపారు. ఇతర ఆస్తులు, రుణాలను వెల్లడించారు. అలాగే జైభారత్ నేషనల్ పార్టీ నుంచి ఇప్పిలి సీతారాజు, పిరమిడ్‌పార్టీ ఆఫ్ ఇండియా తరపున బొమ్మాళి తిరుపతిరావు నామినేషన్ వేశారు.
- అసెంబ్లీ నియోజకవర్గాల విషయానికొస్తే.. ఇచ్ఛాపురం, నరసన్నపేట నియోజకవర్గాలు మినహా ఇతర నియోజకవర్గాల్లో నామినేషన్లు వేశారు. పలాసలో టీడీపీ అభ్యర్థిగా గౌతు శిరీష నామినేషన్ వేశారు. ఎన్నికల అధికారి భరత్‌నాయక్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. తన పేరుమీద రూ.3,70,48,361, భర్త పేరుమీద రూ. 16,35, 17,134, కుమార్తె/కుమారుడి పేరుమీద రూ.83,58, 818 ఆస్తులు ఉన్నట్టు ఎన్నికల అఫిడవిట్‌లో శిరీష పేర్కొన్నారు. టీడీపీ డమ్మీ అభ్యర్థిగా మాజీమంత్రి, శిరీష తండ్రి గౌతు శ్యామసుందరశివాజి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే పలాస కాంగ్రెస్ అభ్యర్థిగా మజ్జి త్రినాథ్‌బాబు రెండుసెట్ల నామినేషన్ వేశారు.
- ఆమదాలవలసలో టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్‌తో పాటు ఆయన సతీమణి, పొందూరు మాజీ ఎంపీపీ కూన ప్రమీల చెరో రెండు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్‌కు అందజేశారు. ముహూర్తం ప్రకారం నామినేషన్ వేశామని, 23న పార్టీ శ్రేణులు, అభిమానుల సమక్షంలో మరోసారి నామినేషన్ వేయనున్నట్టు రవికుమార్ ప్రకటించారు.
- పాతపట్నంలో టీడీపీ తరపున మామిడి గోవిందరావు, మామిడి సుదిష్ణ నామినేషన్ వేశారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.
- టెక్కలిలో వైసీపీ నుంచి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కాంగ్రెస్ నుంచి కేంద్రమాజీ మంత్రి కిల్లి కృపారాణి నామినేషన్లు వేశారు. తనపై ఎటువంటి కేసులు లేవని ఎన్నికల అఫిడవిట్‌లో కృపారాణి వెల్లడించారు. రూ.1,61,25,000 విలువ చేసే 215 తులాల బంగారం, రూ.3.40లక్షల విలువైన ఐదు కిలోల వెండి, 1,94,56,000 విలువచేసే చరాస్తులు, రూ.3.10 లక్షల విలువైన స్థిరాస్తులు ఉన్నట్టు ప్రకటించారు. విశాఖలో రూ.75లక్షలు విలువచేసే కమర్షియల్ బిల్డింగ్, టెక్కలి, విశాఖలో స్థిర నివాసాల విలువ రూ.80లక్షలు ఉంటుందని తెలిపారు. తదితర ఆస్తులు, ఇతర అప్పుల వివరాలను వెల్లడించారు.
- శ్రీకాకుళంలో భారత చైతన్య యువజన పార్టీ నుంచి పనిలి ప్రసాద్ నామినేషన్ వేశారు. ఎచ్చెర్ల నుంచి వైసీపీ తరపున గొర్లె కిరణ్ కుమార్, గొర్లె పరిమళ, బహుజన సమాజ్‌పార్టీ నుంచి గంట్లాన రామారావు నామినేషన్ వేశారు.

- నియోజవర్గం పేరు : నరసన్నపేట
- రిజర్వేషన్ : ఓపెన్
- మండలాలు: నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట
- గ్రామపంచాయతీలు: 125
- లోకసభ నియోజవర్గం పరిధి: శ్రీకాకుళం
- మొత్తం ఓటర్లు 2,012,933
- పురుషులు : 1,06321
- స్త్రీలు : 1,06599
- ట్రాన్స్ జెండర్లు : 13

పేట.. ఎవరి కోట


నరసన్నపేట నియోజకవర్గ మ్యాప్

జిల్లాలో నరసన్నపేట నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. ప్రతీ ఎన్నికల్లో ఇక్కడ ఓటర్లు విలక్షణ తీర్పు ఇస్తుంటారు. ఇప్పటివరకు టీడీపీ నాలుగుసార్లు, కాంగ్రెస్ ఐదుసార్లు, వైసీపీ రెండుసార్లు గెలుపొందాయి. గతంలో శిమ్మ, ధర్మాన, బగ్గు కుటుంబాల మధ్యే తీవ్ర పోటీ ఉండేది. ఈసారి ఎన్నికల్లో టీడీపీ నుంచి బగ్గు రమణమూర్తి, వైసీపీ నుంచి ధర్మాన కృష్ణదాస్ బరిలో నిలిచారు. వీరిది ఒకే గ్రామం, ఒకే సామాజిక వర్గం, పైగా సమీప బంధువులు. దీంతో గెలుపు కోసం ఇరువురూ శ్రమిస్తోన్నారు. అయితే, ఇక్కడ టీడీపీ కేడర్ బలంగా ఉండడంతో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

(నరసన్నపేట)


నరసన్నపేట పట్టణం

కులాల వారీగా ఓటర్లు..	
వెలమ	48,165
కాళింగ	26,623
కాపు	27,951
ఎస్సీ, ఎస్టీ	19,076
శ్రీయన	22,321
వైశ్య	15,034

- విలక్షణ తీర్పు ఇస్తున్న ఓటర్లు
- నాలుగుసార్లు టీడీపీ విజయం
- ఐదుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు వైసీపీ గెలుపు
- ఈసారి బరిలోకి దిగుతున్న బగ్గు, ధర్మాన
- బలంగా తెలుగుదేశం పార్టీ

మొదటి సాధారణ ఎన్నికల తరువాత 1952లో ఏర్పడిన నగరికటకం నియోజకవర్గంలో నరసన్నపేట అంతర్భాగంగా ఉండేది. ఈ నియోజక వర్గ మొదటి ఎమ్మెల్యేగా హెచ్.సత్యనారాయణ దొర ఎన్నికయ్యారు. అయితే, 1957లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో నగరికటకం అంతరించి దానిస్థానంలో కొత్తగా నరసన్నపేట నియోజవర్గంగా ఏర్పడింది. అదే ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో వండాన సత్యనారాయణపై శిమ్మ జగన్నాథం గెలుపొందారు. నాటి నుంచి నేటి వరకు వెలమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే శాసన సభ్యులుగా ఎన్నికవుతున్నారు. ఒకసారి మాత్రం కాపు సామాజిక వర్గానికి చెందిన డోల సీతారాములు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1957 నుంచి 1972 వరకు స్వతంత్ర పార్టీకి చెందిన శిమ్మ జగన్నాథం ఎమ్మెల్యేగా కొనసాగారు. 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన బగ్గు సరోజనమ్మ.. శిమ్మ జగన్నాథంపై విజయం సాధించారు. 1978లో జరిగిన ఎన్నికల్లో ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన డోల సీతారాములు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత జరిగిన ఎన్నికల్లో శిమ్మ జగన్నాథం కుమారుడు శిమ్మ ప్రభాకరరావు టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు టీడీపీ అభ్యర్థి శిమ్మ ప్రభాకరరావుపై గెలుపొందారు. 1994లో టీడీపీ అభ్యర్థి బగ్గు లక్ష్మణరావు, 1999లో కాంగ్రెస్ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు గెలుపొందారు. 2004 సాధారణ ఎన్నికల సమయానికి నియోజవర్గ పునర్విభజనతో హరిశ్చంద్రపురం నియోజవర్గంలోని 44 పంచాయతీలు నరసన్నపేట నియోజవర్గంలో విలీనమయ్యాయి. అప్పటివరకు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న ధర్మాన ప్రసాదరావు నరసన్నపేటలో తన సోదరుడు ధర్మాన కృష్ణదాస్‌ను పోటీలోకి దించారు. ప్రసాదరావు శ్రీకాకుళం నియోజవర్గానికి మారిపోయారు. 2004, 2009 ఎన్నికల్లోనూ, 2012 ఉప ఎన్నికలో, 2019 ఎన్నికలో ధర్మాన కృష్ణదాస్ విజయం సాధించారు.

మూడు కుటుంబాల మధ్యే పోరు...

నియోజవర్గంలో ప్రధానంగా మూడు కుటుంబాల మధ్యనే పోరు సాగుతుంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా శిమ్మ జగన్నాథం, కాంగ్రెస్‌కు మద్దతుగా బగ్గు సరోజనమ్మ, డోల సీతారాములు కుటుంబాలు వ్యవహరించాయి. ధర్మాన ప్రసాదరావు కుటుంబం 1989 నుంచి రాజకీయాల్లోకి వచ్చింది. 2012 ఉప ఎన్నికల వరకూ ధర్మాన, బగ్గు కుటుంబాల మధ్య పోరు సాగింది. ప్రధానంగా శిమ్మ జగన్నాథం, ధర్మాన ప్రసాదరావు, బగ్గు లక్ష్మణరావు కుటుంబాల మధ్యే పోటీ ఉండేది. 2014, 2019, 2024 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన బగ్గు రమణమూర్తి, వైసీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్‌లు సమీప బంధువులే. ఇరువురు ఒకే గ్రామానికి చెందిన వారు కావడం విశేషం. వీరిది పోలాకి మండలం మబగాం. 2014 ఎన్నికల్లో బగ్గు రమణమూర్తి ధర్మాన కృష్ణదాస్‌పై గెలుపొందగా, 2019 ఎన్నికల్లో ధర్మాన కృష్ణదాస్ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మళ్లీ వీరే పోటీల్లో ఉన్నారు. ఏదిఏమైనా నరసన్నపేట నియోజవర్గంలో ప్రధానంగా బంధువుల మధ్య పోటీ సాగుతుంది.


శిమ్మ జగన్నాథం


డోల సీతారాములు


బగ్గు సరోజనమ్మ

మారిన రాజకీయ స్వరూపం..

ధర్మాన కృష్ణదాస్‌కు అనుకూలంగా ఉండే నియోజవర్గంలో ఇప్పుడు రాజకీయ స్వరూపం మారింది. 2012 ఉప ఎన్నికలో వైసీపీ నుంచి ధర్మాన కృష్ణదాస్, కాంగ్రెస్ నుంచి ఆయన సోదరుడు ధర్మాన రామదాస్ పోటీ పడ్డారు. అప్పటివరకు ధర్మాన సోదరులకు అనుకూలంగా ఉండే మండల, గ్రామస్థాయి నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారు. 2014 ఎన్నికల్లో ధర్మాన సోదరులు ఒక్కటైనా.. క్యాడర్ మాత్రం ఒక్కటి కాలేకపోయారు. అప్పట్లో ధర్మాన ప్రసాదరావుకు అనుకూలంగా ఉండే పలువురు కీలక నాయకులు సైకిల్ ఎక్కారు. నరసన్నపేట మండలానికి చెందిన రాడ మోహనరావు, జలుమూరు మండలానికి చెందిన వెలమల కృష్ణారావు, దుంగ స్వామిబాబు, తత్ర పార్థవరావు, పోలాకి మండలానికి చెందిన సూరపు నారాయణదాసు వంటి వారు టీడీపీలో చేరారు. వీరితో పాటు పలువురు గ్రామస్థాయి నాయకులు కూడా టీడీపీలో చేరారు. వారందర్ని కలుపుకుంటూ బగ్గు రమణమూర్తి సమన్వయంతో ముందుకు పోవడంతో 2014లో విజయం సాధించారు. 2019లో జగన్ రెడ్డి ఒక్క చాన్స్ ఇవ్వాలని కోరడంతో ప్రజలు నమ్మి ధర్మాన కృష్ణదాస్‌ను గెలిపించారు.

బలం పెంచేందుకు టీడీపీ వ్యూహం

2019 ఎన్నికల్లో జరిగిన పొరపాటు నుంచి బయట పడేందుకు టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి తన వ్యూహాన్ని మార్చారు. గ్రామస్థాయిలో అధికార పక్ష నాయకులను కలుపుకుంటూ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను గ్రామాల్లో చురుగ్గా చేపడుతూ కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ఆయన చాలా బలమైన నేతగా మారారు.


బగ్గు లక్ష్మణరావు


బగ్గు రమణమూర్తి


ధర్మాన కృష్ణదాస్


ధర్మాన ప్రసాదరావు

వెలమ సామాజికవర్గం అధికం

నియోజకవర్గంలో వెలమ సామాజికవర్గం ఓట్లు అధికం. బరిలో నిలిచిన అభ్యర్థులు ఇద్దరూ కూడా ఈ వర్గానికి చెందిన వారే. దీంతో ఆ సామాజిక వర్గ ఓట్లు రెండుగా చీలుతాయి. పోలాకి మండలంలో అత్యధికంగా కాళింగ సామాజిక వర్గం ఉండగా, సారవకోట మండలంలో కాపు ఓట్లు ఉన్నాయి. ముఖ్యంగా శ్రీశయన, వైశ్య , ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఓట్లు అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయిస్తాయి. వైశ్య మత్స్యకార సామాజిక వర్గం ఓట్లు టీడీపీకి పడే అవకాశం ఉంది. శ్రీశయన, విశ్వబ్రాహ్మణ, నాయీబ్రాహ్మణులు ఎక్కువ శాతం టీడీపీ వైపు మొగ్గు చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మూడోసారి బగ్గు..

1982లో టీడీపీ ఆవిర్భావం నుంచి బగ్గు రమణమూర్తి పార్టీలో కొనసాగుతున్నారు. 2004, 2009లో రెండు పర్యాయాలు జడ్పీటీసీగా పనిచేశారు. 2009లో జడ్పీ ఛైర్మన్ పదవి వచ్చి చేజారిపోయింది జడ్పీ వైస్‌ఛైర్మన్‌గా వ్యవహరించారు. మొదటిసారిగా 2014లో నరసన్నపేట అభ్యర్థిగా బరిలో దిగి విజయం సాధించారు. 2019లో ఓడిపోయారు. ప్రస్తుత ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిగా మూడోసారి బరిలో దిగుతున్నారు. ఈయన భార్య బగ్గు సుగుణ జలుమూరు జడ్పీటీసీగా పనిచేశారు.

ఐదోసారి కృష్ణదాస్..

ధర్మాన కృష్ణదాస్ క్రియాశీలక రాజకీయాల్లోకి 2004లో వచ్చారు. అంతకు ముందు వరకూ తన తమ్ముడు ధర్మాన ప్రసాదరావు వెనుక ఉండేవారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేశారు. 2002లో జిల్లాలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన పాదయాత్ర పట్ల ఆకర్షితులయ్యారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి టీడీపీ అభ్యర్థి బగ్గు లక్ష్మణరావుపై గెలుపొందారు. 2009లో కూడా గెలుపొందారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మృతిచెందిన తరువాత ఆయన కుమారుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెట్టిన వైసీపీలో చేరారు. 2012లో కాంగ్రెస్ పార్టీకి, తన ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో తన సోదరుడు ధర్మాన రామదాస్‌పై గెలుపొందారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి చేతిలో ఓడిపోయారు. 2019లో గెలుపొందారు. ఇప్పుడు ఐదోసారి బరిలో దిగుతున్నారు.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
1957	హెచ్. సత్యనారాయణ దొర	-	-	-	-
1962-1973	శిమ్మ జగన్నాథం	స్వతంత్ర	వండాన సత్యనారాయణ	కాంగ్రెస్	5,387
1973-1978	బగ్గు సరోజనమ్మ	రెడ్డి కాంగ్రెస్	శిమ్మ జగన్నాథం	స్వతంత్ర పార్టీ	6,238
1978-1983	డోల సీతారాములు	కాంగ్రెస్	బగ్గు సరోజనమ్మ	రెడ్డి కాంగ్రెస్	8,349
1983-1985	శిమ్మ ప్రభాకరరావు	టీడీపీ	డోల సీతారాములు	కాంగ్రెస్	23,765
1985-1989	శిమ్మ ప్రభాకరరావు	టీడీపీ	ధర్మాన ప్రసాదరావు	కాంగ్రెస్	22,934
1989-1994	ధర్మాన ప్రసాదరావు	కాంగ్రెస్	శిమ్మ ప్రభాకరరావు	టీడీపీ	8,421
1994-1999	బగ్గు లక్ష్మణరావు	టీడీపీ	ధర్మానప్రసాదరావు	కాంగ్రెస్	6,548
1999-2004	ధర్మాన ప్రసాదరావు	కాంగ్రెస్	బగ్గు లక్ష్మణరావు	టీడీపీ	7,828
2004-2009	ధర్మాన కృష్ణదాస్	కాంగ్రెస్	బగ్గు లక్ష్మణరావు	టీడీపీ	6,378
2009-2012	ధర్మాన కృష్ణదాస్	కాంగ్రెస్	బగ్గు లక్ష్మణరావు	టీడీపీ	8,349
2012-2014 (ఉప ఎన్నిక)	ధర్మాన కృష్ణదాస్	వైసీపీ	శిమ్మ స్వామిబాబు	టీడీపీ	17,693
2014-2019	బగ్గు రమణమూర్తి	టీడీపీ	ధర్మాన కృష్ణదాస్	వైసీపీ	4,967
2019-2024	ధర్మాన కృష్ణదాస్	వైసీపీ	బగ్గు రమణమూర్తి	టీడీపీ	19,373

ఓటు కావాలంటే.. అమ్మవారి సాక్షిగా హామీ ఇవ్వాల్సిందే!

గ్రామ కట్టుబాటు


నువ్వలరేవు గ్రామం

వజ్రపుకొత్తూరు: జిల్లాలోనే ప్రత్యేక ఆచార, సంప్రదాయాలకు నిలయంగా నువ్వలరేవు గ్రామం నిలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల పోటీలో నిలబడే అభ్యర్థులకు ఓటు వేయాలంటే ఈ గ్రామంలో ఓ కట్టుబాటు ఉంది. ఓట్ల కోసం వచ్చిన నాయకులతో గ్రామదేవత బృందావతిమాత ఆలయం వద్ద సమావేశమవుతారు. గ్రామానికి ఏమికావాలో అమ్మవారి సాక్షిగా వారి నుంచి హామీ తీసుకుంటారు. హామీ ఇచ్చిన వారికే ఓటు వేయాలని తీర్మానిస్తారు. తమ మధ్య ఎలాంటి రహస్యాలు ఉండకూడదనే ఉద్దేశంతోనే అమ్మవారి ఆలయం వద్ద సమావేశం అవుతామని గ్రామస్తులు చెబుతున్నారు. ఏ నిర్ణయమైనా బహిరంగంగానే తీసుకుంటారు. గ్రామపెద్దల నిర్ణయానికి అంతా కట్టుబడి ఉంటారు. కాగా, ఈ గ్రామంలో పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలు జరగవు. గ్రామస్థులే సమావేశమై అభ్యర్థులను నిర్ణయించి వారినే ఏకగ్రీవం చేస్తారు. ఇప్పటివరకు గ్రామంలో ఈ రెండు ఎన్నికలు జరగలేదు. వారికి రిజర్వేషన్లు నచ్చకపోతే ఎన్నికలను బహిష్కరిస్తారే తప్ప ఎన్నికలను మాత్రం నిర్వహించరు. అయితే సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం గ్రామస్థులు కలసికట్టుగా నిర్ణయం తీసుకుంటారు.


గ్రామదేవత బృందావతి మాత

అమ్మో.. గొట్టా బ్యారేజీ

రాజకీయ సెంటిమెంట్


- దీన్ని దాటితే పదవీ గండమట..!

హిరమండలం

వంశధార ప్రాజెక్టు పేరు చెబితే పదవిలో ఉన్న ప్రజాప్రతినిధులు ఉలిక్కిపడుతుంటారు. పదవుల్లో ఉన్న నాయకులు హిరమండలం ప్రాంతంలోని వంశధార ప్రాజెక్టుకు సంబంధించి ఏమైనా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తే పదవులు కోల్పోతారనే సెంటిమెంట్ ఉంది. అలాగే, ఈ నదిపై ఉన్న గొట్టా బ్యారేజీపై నుంచి ప్రయాణించినా పదవీచ్యుతులు అవుతామనే సెంటిమెంట్ నాయకుల్లో ఉంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. ప్రాజెక్టు పరిధిలో పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి తిరిగి వెళ్లే సరికి పలువురు ముఖ్యమంత్రులు, మంత్రులు పదవులు కోల్పోవడం, సంక్షోభాన్ని ఎదుర్కొన్న వంటి సంఘటనలు రాష్ట్రంలో చోటుచేసుకున్నాయి.

కొన్ని సెంటిమెంట్లు..

- టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీ రామారావు పాడలి జంక్షన్ సమీపంలో 11 టీఎంసీలతో వంశధార రిజర్వాయర్ నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. రాజధానికి చేరుకోకుండానే పదవికి గండం ఏర్పడి కొద్దిరోజుల్లోనే పదవీచ్యుతులయ్యారు.
- టీడీపీ హయాంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు తమ్మినేని సీతారాం, ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో కడియం శ్రీహరి వంశధార ప్రాజెక్టును సందర్శించారు. తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వారి శాఖలను మార్చారు.
- రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో ఎన్నికల ప్రచారానికి ఈ ప్రాంతం మీదుగా సినీనటుడు మోహన్‌బాబు వచ్చారు. తిరిగి వెళ్లే సరికి పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు.
- సీఎం హోదాలో జలగం వెంగళరావు వంశధార ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి తిరిగి వెళ్లే సరికి ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ ఆయన్ను ముఖ్యమంత్రి పదవిని నుంచి తొలగించారు. అలాగే సీది వంతెన నిర్మాణానికి శంకుస్థాపనకు వచ్చిన భవనం వెంకట్రామ్ తన సీఎం పదవిని కోల్పోయారు.
- వంతెన ప్రారంభోత్సవానికి వచ్చిన నేదురమల్లి జనార్దన రెడ్డి కూడా ముఖ్యమంత్రి పదవిని కోల్పోయారు. ఈ ప్రాజెక్టు పరిధిలో పర్యటించిన టంగుటూరి అంజయ్య, నేదురమల్లి జనార్దనరెడ్డి కూడా రాజధానికి తిరిగి వెళ్లిన తర్వాత పదవులు కోల్పోయారు.


గొట్టా బ్యారేజీ

సోంపేట నియోజకవర్గం కనుమరుగు

గత చరిత్ర


సోంపేట పట్టణం

సోంపేట: నాలుగు దశాబ్దాలపాటు నియోజకవర్గంగా కొనసాగిన సోంపేట 2009లో పునర్విభజనలో కనుమరుగైంది. ఇక్కడి నుంచి పలువురు ప్రముఖులు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు గౌతు లచ్చన్న ఎమ్మెల్యేగా ఇక్కడి నుంచే గెలుపొందారు. 1952లో జరిగిన మొదటి ఎన్నికల్లో లచ్చన్న విజయం సాధించారు. ఆయన కుమారుడు గౌతు శ్యామసుందర శివాజీ కూడా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఇక్కడి నుంచే ఎన్నికయ్యారు. వీరే కాకుండా మజ్జి తులసీదాస్ ఒకసారి, మజ్జి నారాయణరావు రెండేళ్ల పాటు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజ కవర్గాల డిలిమిటేషన్‌లో భాగంగా 2009 సోంపేటను రద్దు చేశారు. ఈ నియోజకవర్గం పరిధిలో సోంపేట, మందస, పలాస మండలాలు ఉండేవి. సోంపేట మండలాన్ని ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కలపగా, పలాస, మందసను కలిపి పలాస నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. పునర్విభజన తర్వాత సోంపేట నుంచి ప్రాతినిధ్యం వహించిన శివాజీ పలాసలో 2009లో పోటీచేశారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
శనివారం 20 ఏప్రిల్ 2024



మరమ్మతులకు నోచుకోని డబార్సింగ్ రిజర్వాయర్

ఎన్నికలప్పుడే గుర్తొస్తామా?

- ప్రశ్నిస్తున్న మందస వాసులు ● అభివృద్ధిని పట్టించుకోని సర్కారు ● ఐదేళ్లుగా పాలకుల నిర్లక్ష్యం
- అధ్వానంగా గిరిజన రోడ్లు ● కానరాని ప్రభుత్వ ఆస్పత్రి, డిగ్రీ కళాశాల ● శిథిలావస్థలో రిజర్వాయర్లు, కాలువలు

మందస మండలం దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ముఖ్యంగా వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ మండలాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లుగా అధికార పార్టీ పాలకులు పట్టించుకోకపోవడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దశాబ్దాల కిందట నిర్మించిన రిజర్వాయర్ల నిర్వహణను గాలికొదిలేశారు. సాగునీటి కాలువల్లో పూడిక, పిచ్చిమొక్కలు పెరిగి శివారు ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. వైసీపీ పాలకులకు తాము ఎన్నికలప్పుడే గుర్తొస్తామని ఇక్కడి ప్రజలు విమర్శిస్తున్నారు.

(హరిపురం)

మందస మండలానికి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఏజెన్సీ, మైదాన, తీర ప్రాంతాల కలయికతో అన్నిరకాల సామాజికవర్గ ప్రజలతో మమేకమై ఉంటుంది. ఉద్యమాలకు ఊపిరిగా ఈ మండలం నిలిచింది. ఎంతోమంది త్యాగధనుల జన్మభూమిగా పేరుగాంచింది. అయితే దశాబ్దాలుగా పాలకులు మారుతున్నా సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడంలేదు.

ఇవీ సమస్యలు..

- మండలంలో కేవలం 45 గ్రామాలకు మాత్రమే ఉద్దానం నీటి పథకం ద్వారా తాగునీరందుతోంది. ఇది కూడా నాలుగేళ్లుగా నెలకు పదిరోజులకు మించి రావడంలేదు. ఏటా వేసవిలో తాగునీటి సమస్య మరింత జఠిలంగా మారుతోంది.
- తీర ప్రాంతంలో ఏళ్ల తరబడి సాగు చేసిన సరుగుడు వనాలు అక్రమార్కుల పాలవుతున్నాయి. దీంతో తీరం కోతకు గురవుతోంది.
- ఉద్దాన, తీరప్రాంత ప్రజల సాగు, తాగు నీటి ప్రధాన వనరుగా ఉన్న జంతిబంద రిజర్వాయర్ ఎన్నికల హామీగానే మిగిలిపోయింది. దీంతో ఏటా వర్షాకాలంలో వస్తున్న నీరు నిల్వచేయడానికి అవకాశం లేకపోవడంతో సముద్రం పాలవుతోంది. ఈ నేపథ్యంలో ఖరీఫ్ శివారులో సాగునీటికి అగచాట్లు తప్పడంలేదు.
- దశాబ్దాల కాలం కిందట టీడీపీ హయంలో నిర్మించిన డబార్సింగి, కళింగదళ్ రిజర్వాయర్లు మరమ్మతులకు నోచుకోవడంలేదు. దీంతో కాలువలు శిథిలావస్థకు చేరడంతో శివారు ఆయకట్టుకు నీరందడం లేదు.
- బెల్లుపటియావద్ద కూలిపోయిన ఇనుపవంతెను ఏళ్లుగా పట్టించుకొనే నాథుడేలేడు. టీడీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు కాగా పనులు కొంత మేర జరిగాయి. ఇంతలో ప్రభుత్వం మారడంతో సమస్య మొదటి కొచ్చింది.
- హరిపురం, మందసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి నాయకులు ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉన్నత చదువులకోసం పలాస, సోంపేటలోని కళాశాలలను ఆశ్రయించాల్సివస్తోంది. కొంతమంది తల్లిదండ్రులు బాలికలను ఇంటర్‌తో నిలిపివేయిస్తున్నారు.
- మండలంలో తీరప్రాంత గ్రామాల్లో కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలని మత్స్యకారులు దశా బ్దాలుగా కోరుతున్నారు. కష్టబడి సముద్రంలో వేట చేసిన చేపలను తక్కువ ధరకు విక్రయించాల్సివస్తోందని మత్స్యకారులు వాపోతున్నారు.
- హరిపురం, మందసలో రైతు బజార్లు ఏర్పాటు కలగా మారింది. ఇక్కడ లేకపో వడంతో కూరగాయల రైతులు దోపిడీకి గురవుతున్నారు. తక్కువ ధరకే దళారులకు విక్రయించాల్సివస్తోంది.
- హరిపురం, మందసలో రోడ్ల విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఈ రెండు పంచా యతీల్లో పూర్తిస్థాయి డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరుతుంది.
- ఉద్దానం ప్రాంతంలో సుమారు 65గ్రామాలకు అందుబాటులో ప్రాథమికఆరోగ్య కేంద్రం లేదు. దీంతో చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు సైతం ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్ర యిస్తున్నారు.
- సంకుజోడి రిజర్వాయర్‌ను ఏర్పాటు చేస్తే మందస, సోంపేట మండలాల పరిధి 22 గ్రామాల్లో ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందుతుందని ఇక్కడి రైతులు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువస్తున్నా ఫలితం లేకుండాపోతుంది.
- దామోదరసాగర్ రిజర్వాయర్ పరిధిలో కాలువల నిర్మాణం పూర్తిగా చేపట్టలేదు. దీంతో ఏటా ఖరీఫ్‌లో సైతం శివారు భూములకు నీరందని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.
- మండలంలో 35 గిరిజన గ్రామాల్లోని అంతర్గత రహదారులు పూర్తిగా అధ్వానంగా మారాయి. ఏటా వర్షాకాలంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. ఇక్కడ రహదారుల దుస్థితిని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని గిరిజనులు చెబుతున్నారు.
- ఫ్లోరైడ్ పీడిత కొండలోగాంలో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసి పంచాయతీలోని 14 గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు దశాబ్దాలుగా కోరుతున్నారు. పరిశుభ్రమైన తాగు నీరు లభించక ఏటా వందల మంది వ్యాధులబారిన పడుతున్నారు.
- మందస మండలంలో ఎక్కువ భాగం అటవీప్రాంతం విధ్వంసం కావడం, గొడ్డలిపేటుకు గురివడం తదితర కారణాల వల్ల వణ్య ప్రాణు లు గ్రామాలకు చేరుతున్నాయి. దీంతో వాటి దాడుల నుంచి రక్షించాలని ప్రభుత్వాన్ని గిరిజనులు వేడుకుంటున్నారు.



అర్ధాంతరంగా నిలిచిన దామోదర సాగర్ రిజర్వాయర్ పనులు

నాయకులు ఆలోచించాలి



నాయకులకు ప్రజలు పడుతున్న బాధలు ఎన్నికల సమయంలోనే గుర్తొస్తాయి. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే దిశగా నాయకులు ఆలోచించాలి. ప్రధానంగా మండలంలో సాగునీటి వనరుల అభివృద్ధికోసం నిధులు మంజూరుచేసి ఆదుకోవాలి. వచ్చిన నిధులు వాటాలు వేసుకుని పంచుకోకుండా అవి సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలి.

-గొలుసు మురళి, ఉయ్‌ఫర్‌ఆల్ స్వచ్ఛంద సంస్థ, హరిపురం

ఉపాధి చూపించి ఆదుకోవాలి..



మందస మండలం విద్యాపరంగా ఎంతో వెనుకబడి ఉంది. ప్రభుత్వం విద్యాసంస్థలు ఏర్పాటుచేసి ఏజెన్సీ, ఉద్దానం ప్రాంతంలోని యువత ముందడుగు వేసేలా చర్యలు తీసుకోవాలి. తీరప్రాంతంలోని యువత వలస బాట పట్టకుండా ఉపాధి చూపించి ఆదుకోవాలి.

- ఎం.కుమారస్వామి, కంప్యూటర్ అధ్యాపకుడు, హరిపురం



పాతపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

సందడిగా నామినేషన్లు

- పలాస, పాతపట్నం టీడీపీ అభ్యర్థులు శిరీష, గోవిందరావు దాఖలు
- పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి: ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు

పలాస/పాతపట్నం, ఏప్రిల్ 19: జిల్లాలో నామినేషన్ల సందడి నెలకొంది. రెండోరోజు శుక్రవారం పలాస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష, పాతపట్నం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు నామినేషన్లు దాఖలు చేశారు. శిరీష తన సెంటిమెంట్‌లో భాగంగా తొలుత కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ప్రతిమ ఎదుట భర్త యార్లగడ్డ వెంకన్న చౌదరితో కలిసి పూజలు నిర్వహించారు. వేద పండితుల వద్ద ఆశీసులు తీసుకున్నారు. అనంతరం క్రిస్టియన్, ముస్లిం మత పెద్దల ప్రార్థనలు చేశారు. అనంతరం 11.30 గంటలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పించారు. అలాగే, మామిడి గోవిందరావు నామినేషన్ వేసే ముందు పాతపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల నుంచి భారీగా తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాతపట్నం పసుపుమయమయ్యింది. ఈ ర్యాలీలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు పాల్గొని మాట్లాడారు. ఎన్డీయే కూటమి విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఎన్డీయే కూటమికి అధికారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎంపీగా మరోసారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే ఓటు మామిడి గోవిందరావుకు, ఎంపీ ఓటు తనకు వేసి అత్యధిక మెజార్టీతో గెలపించాలని ప్రజలను కోరారు.



పలాసలో సర్వ మతపెద్దల నుంచి ఆశీర్వాదం అందుకుంటున్న శిరీష

ప్రజలు ఇక్కట్లకు 'సిద్ధం' కావాల్సిందే

- సీఎం సభకు బస్సులు తరలింపు

శ్రీకాకుళం అర్బన్, ఏప్రిల్ 19: సీఎం జగన్ సభలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. శుక్రవారం కాకినాడలో సీఎం జగన్ నిర్వహించిన 'సిద్ధం' సభకు.. జిల్లా నుంచి 80 బస్సులు తరలించారు. శ్రీకాకుళం ఒకటి, రెండో డిపోల నుంచి 40 బస్సులు చొప్పున జగన్ సభకు కేటాయించారు. దీంతో బస్సులు లేక జిల్లాలో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. విశాఖ పట్నంతోపాటు జిల్లా నలుమూలలకు వెళ్లే ప్రయాణికులు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షించారు. కొంతమంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఏమైందబ్బా?

- వైసీపీ ఎంపీ అభ్యర్థి తిలక్ నామినేషన్ ర్యాలీకి ధర్మాన దూరం
- చివరి నిమిషంలో హాజరై.. ప్రక్రియ పూర్తికాకముందే నిష్క్రమణ



శ్రీకాకుళం అర్బన్, ఏప్రిల్ 19: శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ వైసీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ శుక్రవారం నగరంలోని 80 అడుగుల రోడ్డు నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు. అయితే, ఈ ర్యాలీకి అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన వైసీపీ అభ్యర్థులంతా హాజరైనా ధర్మాన ప్రసాదరావు, ఆయన వర్గీయులు మాత్రం గైర్హాజరయ్యారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పిరియా విజయ, రెడ్డి శాంతి, ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, దువ్వాడ శ్రీను, తమ్మినేని సీతారాం హాజరై పేరాడ తిలక్‌తో కలిసి భారీ ర్యాలీగా కలెక్టరేట్ వరకు వెళ్లారు. కానీ, శ్రీకాకుళం నియోజకవర్గ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు దూరంగా ఉండడంపై చర్చనీయాంశంగా మారింది. చివరి క్షణంలో హడావుడిగా కలెక్టరేట్‌కు ధర్మాన వచ్చారు. అయితే, తిలక్ నామినేషన్ ప్రక్రియ పూర్తికాకుండానే ఆయన వెనుతిరిగారు. దీంతో ఏమైంటుందబ్బా అని అంతా చర్చించుకుంటున్నారు.

ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్, ఏప్రిల్ 19: సాధారణ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళం ఏడురోడ్లకూడలిలో ఓటుహక్కు వినియోగంపై స్వీప్ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధికారులు, విద్యార్థులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఎన్నికల కన్నా ఓటింగ్ శాతం పెరగాలన్నారు. అందరూ స్వేచ్ఛగా ఓటు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, డీపీవో వేంకటేశ్వర్లు, డీఈవో వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది కోసం పోస్టల్ బ్యాలెట్

జిల్లాలో ఎన్నికల విధుల కోసం నియమించిన సిబ్బందికి ఇతర జిల్లాల్లో ఓటు ఉంటే వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి మంజీర్ జిలానీ సమూన్ ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు గాను ఫారం-12, ఎపిక్ కార్డు జిరాక్స్‌ను సంబంధింత తహసీల్దార్‌కు అందజేయాలని తెలిపారు. ఇంతవరకు ఫారం-12 అందనివారు ఈ నెల 21 లోగా సంబంధిత తహసీల్దార్ నుంచి పొంది, వెంటనే అందజేయాలని అన్నారు.

అభ్యర్థుల వ్యయాన్ని పక్కాగా లెక్కించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు కేజీ మీనా, శరవణకుమార్



మాట్లాడుతున్న మీనా, శరవణ

కలెక్టరేట్: ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి రూపాయిని పక్కాగా లెక్కించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు కోమల్‌జిత్ మీనా, శరవణకుమార్ ఆదేశించారు. ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలతో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. డబ్బు, మద్యం, బహుమతులు వంటి ప్రలోభాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ బృందాల పనితీరును కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిఘా బృందాలకు సీసీ కెమెరాలు, జీపీఎస్ ట్యాగ్ సిస్టం అమర్చిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సీ-విజిల్, 1950 టోల్‌ఫ్రీ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల గురించి ఆరా తీశారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, నోడల్ అధికారులు సీపీవో ప్రసన్నలక్ష్మి, ఆడిట్ అధికారి సుల్తానా, డీఐపీఆర్వో చెన్నకేశవరావు, డీపీవో వేంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీసీసీబీ సీఈవో వరప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ● ఎన్నికల వ్యయ పరిశీలకులు కోమల్‌జిత్ మీనా, శరవణ కుమార్ శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

- ఎన్నికల నిబంధనలు మరచిపోవద్దు
- రూ.50వేలకు మించి తీసుకెళ్లకూడదు
- సరైన ఆధారాలు సమర్పించాల్సిందే..



డబ్బు తీసుకెళ్తున్నారా?

గార: ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు అన్ని చోట్లా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. వాహనాలతో పాటు ప్రజలు తమతో పాటు తీసు కెళ్తున్న బ్యాగులు, ఇతర వస్తువులు సైతం పరిశీలిస్తు న్నారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు తీసు కువెళ్తే స్వాధీనం చేసుకుం టారు. కొన్నిసార్లు సొంత పనుల మీద ఇతర ప్రాంతాలకు నగదు తీసుకువెళ్తున్నా ఇబ్బందులు తప్పవు. ఎన్నికల నియమ నిబంధనల మేరకు తగిన ఆధారాలతో అధిక మొత్తంలో నగదు తీసుకుని వెళ్లవచ్చు.

ఫైనాన్స్.. చిట్టీల వ్యాపారం

చిట్టీల, ఫైనాన్స్ సంస్థల్లో నిత్యం భారీగా లావాదేవీలు జరుగుతాయి. కలెక్షన్ ఏజెంట్ల వద్ద రూ.లక్షల్లో నగదు ఉంటుంది. వీరు ఆ రోజు చేసిన కలెక్షన్ పద్దులు, బాకీ ఉన్న నగదు.. వసూలైన మొత్తం.. ఇలా అన్ని వివరాలతో పాటు కస్టమర్ల సంతకంతో కూడిన ప్రతులను తప్పసరిగా తమ వెంట ఉంచుకోవాలి.

బంగారు ఆభరణాల కొనుగోలులో...

శుభకార్యాలు నిర్వహించే సమయంలో బంగారు, ఇతర వస్తువుల కొనుగోలుకు నగదు తీసుకు వెళతారు. శుభకార్యాల కోసం నగదు తీసుకువెళ్లే వారు తమ వెంట శుభలేఖ ఉంచుకోవాలి. అదే విధంగా పోలీసులు అడిగిన అన్ని వివరాలకు పూర్తిగా సమచారం ఇవ్వాలి.

బ్యాంకు లావాదేవీలకు...

బ్యాంకు లావాదేవీలు రూ.50 వేలు మించితే ఆధారాలు చూపించాలి. చెక్కు ద్వారా నగదు విత్ డ్రా చేస్తే చెక్కు జెరాక్స్, పాస్ బుక్ ఉంచుకోవాలి. ఏటీఎం ద్వారా నగదు విత్ డ్రా చేస్తే ఏటీఎం స్లిప్‌లు జాగ్రత్త చేయాలి. ఒక వేళ నగదు బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళితే... సంబందిత అన్ని వివరాలు అందుబాటులో ఉంచుకోవాలి. ఎవరు, ఎందుకు ఇచ్చారో ఆధారాలు ఉండాలి.

విద్యా సంస్థల్లో ఫీజులు..

పిల్లలు చదువుల కోసం సంబంధిత పాఠశాల, కళాశాలల యాజమాన్యాలకు ఫీజులు చెల్లించాలంటే నగదు తీసుకుని వెళ్లలక తప్పదు. ఆటువంటి సమయంలో సంబంధిత కళాశాల యాజమాన్యాలు ఇచ్చిన రసీదు తప్పకుండా ఉండాలి. నగదు చెల్లించకముందు ఫీజు కట్టాలనే నోటీసులు వెంట ఉంచుకోవాలి. అవసరమైతే ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించడం మంచిది.

ఆసుపత్రుల బిల్లులకు...

అత్యవసర సమయాల్లో అధిక మొత్తంలో ఆసుపత్రి బిల్లులు చెల్లించక తప్పదు. అటువంటి సమయంలో రోగి మెడికిల్ కేస్ షీట్, మెడికల్ సర్టిఫికెట్, ఆసుప్రతి బిల్లులు అందుబాటులో ఉంచుకోవాలి.

పంటల డబ్బులు..

ప్రస్తుతం రైతులు తమ పంట ఉత్పత్తిలైన మొక్కజొన్న వరి, పచ్చిమిర్చి, మొదలైన పంటలను విక్రయిస్తున్నారు. రూ.50 వేలకు మించి నగదును ఇంటికి తీసుకెళ్లేటప్పుడు తగిన ఆధారాలను దగ్గర ఉంచుకోవాలి.

మద్యం, డబ్బు అక్రమ రవాణాపై నిఘా పెట్టండి



ఇచ్ఛాపురం: రికార్డులను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు నవీన్‌కుమార్ సోని

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో మద్యం, డబ్బు అక్రమంగా తరలించే అవకాశం ఉన్నందున ప్రత్యేకంగా నిఘా పెట్టి వాటిని నివారించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు నవీన్‌కుమార్ సోని సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో ఇంతవరకు ఎన్ని పర్మిషన్లు ఇచ్చారు, వాటి ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, అకౌంటింగ్, వ్యయపరిశీలన బృందాలతో సమావేశమై సూచన లిచ్చారు. కార్యక్రమంలో ఆర్వో సుదర్శన్ దొర, ఎలక్షన్ డీటీ శ్రీహరి పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రం పరిశీలన

పలాస: పలాస తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకుడు నవీన్ కుమార్ సోని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలాస ఎన్నికల అధికారి, ఆర్డీవో భరత్ నాయక్‌తో చర్చించారు. ఇప్పటి వరకు ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయి, వారి వ్యయ వివ రాలు అడిగి తెలుసుకున్నారు. పలాస, టెక్కలి, పాతపట్నం, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు సంబంధించి నవీన్ కుమార్ సోని ఎన్నికల వ్యయపరిశీలకుడిగా వ్యవహరిస్తున్నారు.

నిష్పక్షపాతంగా లెక్కింపు చేపట్టాలి

నరసన్నపేట: రాజకీయ పార్టీలు నామినేషన్, ప్రచారంలో వినియోగించే జెండాలు, వాహనాల ఖర్చులను నిష్పక్షపాతంగా లెక్కించాలని పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు శరవణ్ కుమార్ సూచించారు. శుక్రవారం నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్వో రామ్మోహన్‌రావు, ఏఆర్వో కనకారావు పాల్గొన్నారు. ● **శ్రీకాకుళం క్రైం:** శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కేకే శరవణకుమార్‌ను ఎస్పీ జీఆర్ రాధిక మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ఆయనకు ఎస్పీ పుష్పగుచ్ఛం ఇచ్చిస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్నికల సన్నద్ధతపై వారు చర్చించారు. ● **టెక్కలి:** టెక్కలి నియోజకవర్గ ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు అబ్జ ర్వర్ నవీన్‌కుమార్ సోనీ శుక్రవారం సాయంత్రం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆర్వో నూరుల్ కమర్‌తో మాట్లాడుతూ.. వ్యయ పరిశీలన పారదర్శకంగా ఉండాలని, పటిష్ఠ నియంత్రణ చర్యలు చేప ట్టాలన్నారు. ఏఆర్వో మురళీకృష్ణ పాల్గొన్నారు. ● సార్వత్రిక ఎన్నికల్లో భాగం గా వివిధ విభాగాల పనితీరు పక్కాగా ఉండాలని, తప్పిదాలు జరగకూడదని ఆర్వో నూరుల్‌కమర్ అన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నియో జకవర్గ వ్యయ పరిశీలకులైన కె.కుమారస్వామి, ఎస్.రమేష్, ఎస్‌వీఎస్ ప్రసాద్ లతో ఆయన చర్చించారు. వీడియో ఫ్లయింగ్ బృందానికి సూచనలు చేశారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● ఏడు తులాల బంగారు, ఐదు తులాల వెండి ఆభరణాలు స్వాధీనం



రైల్వే పోలీసులు పట్టుకున్న బీహార్ గ్యాంగ్ ముఠా దొంగలు(మాస్కులతో)

పలాస, ఏప్రిల్ 19: పలాస రైల్వే స్టేషన్ వద్ద భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ రైలులో శుక్రవారం రైల్వే పోలీసులు తనిఖీ చేపట్టి బీహార్ రాష్ట్రానికి చెందిన అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకొన్నారు.వారి నుంచి ఏడు తులాల బంగారు, ఐదు తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకొని, నిందితు లను విశాఖ రైల్వే కోర్టుకు తరలించారు. రైల్వే ఎస్ఐ షరీష్ విలేకరుల ఎదుట నింది తులను ప్రవేశపెట్టారు. బీహార్ రాష్ట్రానికి చెందిన రంజిత్ కుమార్‌సాహ్, నిశాంత్‌కుమార్ మండల్, జైలో మండల్, ఉదయ్‌కుమార్ మండల్, అన్సకుమార్‌యాదవ్ ఇంటర్‌సిటీ రైలులో సాధారణ ప్రయాణికుల్లా ప్రయాణిస్తూ లగేజీ బ్యాగులు, పాకెట్ కటింగ్ చేస్తూ విలువైన వస్తువులు దొంగిలిస్తున్నారన్నారు. తమ సిబ్బంది సాధారణ తనిఖీల సమయంలో వీరంతా పరారీ అయ్యేందుకు ప్రయత్నించారని, అనుమానంతో వారిని పట్టుకుని ప్రశ్నించి బ్యాగులు తనిఖీ చేయడంతో అసలు విషయం బయట పడిందన్నారు. వారి వద్ద నుంచి 77 గ్రాముల బంగారం, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. నెల రోజుల వ్యవధిలో బీహార్ ముఠా దొంగలను పట్టుకొని రూ.3.39 లక్షల చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దొంగల ముఠాను పట్టుకున్న హెచ్‌సీ కోదండరావు, కానిస్టేబుళ్లు ఎం.సంతోష్‌కుమార్, బి.దేవేంద్రనాథ్, పి.రమేష్ బాబు, టి.తేజలను ఎస్ఐ అభినందించారు.

పెళ్లి సామాన్లకు వెళ్లి వస్తూ.. అనంత లోకాలకు

● ద్విచక్రవాహనం నుంచి జారిపడి మహిళ మృతి



నందిగాం: భాజా భజంత్రీలు మోగాల్సిన ఇంట్లో మృత్యు ఘోష వినిపించింది. ఒక్కగానొక్క కొడుకు వివాహాన్ని ఘనంగా చేయాలన్న ఆ తల్లి ఆశ నెరవేరకుండానే ఆమె అందని లోకాలకు వెళ్లిపోయిన ఘటన నందిగాం మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పెంటూరు గ్రామానికి చెందిన కూర్మాపు సరోజిని (48) తన కుమారుడు రమేష్‌కు ఈనెల 24న వివాహం చేసేందుకు అవసరమైన సామాన్లు కొనుగోలుకు శుక్రవారం కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై పలాస వెళ్లింది. అక్కడ పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా వజ్జీలపేట సమీపంలో హైవేపై ద్విచక్ర వాహనం నుంచి సరోజిని జారిపడి తలకు బలమైన గాయమైంది. వెంటనే ఆమెను టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. తల్లి మృతి చెందడంతో జీర్ణించుకోలేక కుమారుడు రమేష్ కన్నీటి పర్యంతమయ్యాడు. సరోజిని మృతితో కుటుంబంలోను, గ్రామంలో విషాదం నెలకొంది. మృతురాలికి భర్త రామన్న ఉన్నారు. మృతురాలి సోదరుడు జలుమూరు వసంతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు

మట్టి పెళ్లలు కూలి ట్రాక్టర్ డ్రైవర్ మృతి



ఘటనా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: ఇసుకను అక్రమంగా తవ్వు తుండగా మట్టి పెళ్లలు కూలి ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన శుక్రవారం బిర్లంగి గ్రామంలోని ఇసుక రీచ్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇసుకను తరలించేందుకు ట్రాక్టర్‌తో వచ్చిన జగదల్‌పూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బాసుదేవ్ పాత్రో (32) ఇసుకను తవ్వుతుండగా పైనుంచి మట్టి పెళ్లలు కూలడంతో వాటి కింద ఉండిపోయి ఊపిరాడక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య గాయత్రి మాత్రో, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎలుగుబంటి దాడి.. ఒకరికి గాయాలు

హరిపురం: మందస మండలం టి.గంగువాడ గ్రామంలో శుక్రవారం సాయంత్రం తోటలో జీడి పిక్కలు ఏరుతుండగా ఎలుగు దాడి చేయడంతో చిత్త ధనరాజు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఎలుగు దాడి సమయంలో పక్కనే భార్య, మరో ఇద్దరు బంధువులు ఉండడంతో వారు పెద్దగా కేకలు వేయడంతోపాటు కత్తులు, కర్రలు పట్టుకొని వెంబడించటంతో ఎలుగు తోటల్లోకి పారిపోయింది. దీంతో ప్రాణాపాయం తప్పింది. బాధితునికి హుటాహుటిన హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కొండలు పూర్తిగా తొలగించి కంకర అక్రమ రవాణా జరుపుతుండడంతో కొండల్లో ఉండాల్సిన ఎలుగులు గ్రామాలు, తోటల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఆవులు, దూడలను తరలిస్తున్న వాహనం స్వాధీనం



జలుమూరు: ఆవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. కంచిలి నుంచి నారాయణవలస సంతకు బొలేరోలో 15 ఆవుదూడలను బంధించి ఊపిరాడకుండా కట్టి తరలిస్తుండగా చల్లవానిపేట కూడలిలో పట్టుకొన్నామన్నారు. 9 ఆవులను, 6 దూడలను కొత్తవలస గోశాలకు తరలించినట్లు తెలిపారు. ఈమేరకు పెద్దదూగాం గ్రామానికి చెందిన చిన్నాల సంతోష్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి కల్యాణ మహోత్సవం శుక్ర వారం రాత్రి వైభవంగా జరిగింది. తొలుత ఉషా, ఛాయా, పద్మినీ సమేతంగా స్వామి ఉత్సవ మూర్తులను ఆంజనేయ వాహనంపై గ్రామంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటం నడుమ తిరువీధి నిర్వహించారు. అనంతరం అనివెట్టి మండపంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో చతుర్వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణం చేపట్టారు. కార్యక్రమంలో ఈవో ఎస్.చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో చంద్రశేఖర్

అరసవల్లి: ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత అరసవిల్లి సూర్యనారాయణ స్వామిని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ శుక్రవారం దర్శించుకు న్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి జ్ఞాపికను ఈవో ఎస్.చంద్రశేఖర్ అందజేశారు. ● సూర్యనారాయణ స్వామి వారిని కేంద్ర డిప్యూటీ డైరెక్టర్, డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ పూజ పుండ్కర్ దర్శించుకున్నారు. అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి జ్ఞాపికను సిబ్బంది కృష్ణమాచార్యులు, చక్రవర్తి అందజేశారు.

డీసీసీబీ మాజీ చైర్మన్ జగన్ వైసీపీకి రాజీనామా



శ్రీకాకుళం అర్బన్: డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్ వైసీపీకి రాజీనామా చేస్తు న్నట్లు ప్రకటించారు. శుక్రవారం ఓ ప్రైవేటు హోటల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీలో క్రియా శీలకంగా పనిచేసిన తాను ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నానన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానన్నారు. నరసన్నపేటలో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న బగ్గు రమణమూర్తి విజయానికి తోడ్పడతానన్నారు. తాను ఏ పార్టీలో చేరేదీ త్వరలో చెబుతానన్నారు. గడిచిన ఐదేళ్లలో బటన్ నొక్కి డబ్బులు వేస్తున్నానని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ప్రజల కష్టాలను తీర్చలేకపోయిందని విమర్శించారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకుంటేనే రైతు సంక్షేమం సాధ్యపడుతుందని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు.

గౌతు లచ్చన్న ఆశయాలు కొనసాగిస్తాం

పలాస/హరిపురం/అరసవల్లి: సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలను కొనసాగిస్తామని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, శ్రీకాకుళం టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ తదితరులు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు గౌతులచ్చన్న 18వ వర్ధంతిని పలాస, హరిపురం, శ్రీకాకుళంలో నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, గౌతు విజయలక్ష్మి, చంద్రశేఖర్ త్యాడి, కొండె నర్సింహులు, బావన దుర్యోధన, దాసరి తాతారావు, జీకే నాయుడు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి చేరికలు

● వెలమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ భర్త తదితరులు టీడీపీ తీర్థం



అచ్చెన్నాయుడు, బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న సర్పంచ్ పంగ బావాజీ నాయుడు

టెక్కలి/నరసన్నపేట/సంతబొమ్మాళి/నందిగాం: వైసీపీ నుంచి టీడీపీలోకి పలు మండలాలకు చెందిన వైసీపీ నేతలు కార్యకర్తలు చేరారు. నరసన్నపేటకు చెందిన వెలమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పంగ కృష్ణవేణి భర్త, సర్పంచ్ పంగ బాబాజీ నాయుడుతో పాటు ఆయన అనుచ రులు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టెక్కలి మండలం అయోధ్యపురం పంచాయతీ నుంచి బల్లి డిల్లీతో పాటు వార్డు సభ్యులు దాసరి తవుడు, బొడ్డు సింహాచలం తదితరులు చేరారు. సంతబొమ్మాళి మండలం హెచ్ఎన్‌పేట, పాతమేఘవరం గ్రామాల నుంచి మత్స్యకారులు, నందిగాం, నౌపడా పంచాయతీల నుంచి కూడా సుమారు 90 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి నిమ్మాడలోని క్యాంపు కార్యాలయం లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు.

బగ్గు సమక్షంలో చేరిన కృష్ణవేణి

గొట్టిపల్లి, రెడ్డికపేట, కంబకాయ నుంచి కూడా పలువురు నేతలు టీడీపీలో చేరారు. వెలమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పంగ కృష్ణవేణి, మాజీ సర్పంచ్ పంగ శ్రీరాములుతో పాటు చిన్న కరగాం, పెద్దకరగాం, నారాయణవలస, అంపలాంక చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో కింజరాపు హరివరప్రసాద్, బగాది శేషగిరి, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకుంటాం

టెక్కలి: ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే తీరప్రాంత మత్స్యకారులను ఆదుకుంటామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో మత్స్యకారులు, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం మండలాల ముఖ్య నాయకులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. భావనపాడు ప్రాంతంలో మత్స్యకారులకు అవసరమైన జట్టీ నిర్మాణానికి, భావనపాడు బీచ్‌ను పర్యా టకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఈనెల 22న టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గం కూటమి అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నానని, దీంతో వైసీపీలో వణుకు మొదలవుతుందన్నారు. సుమారు 50వేల మందికి తక్కువ లేకుండా నామినేషన్ ప్రక్రియకు టెక్కలి-తెంబూరు రోడ్డు జంక్షన్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు.

వైసీపీకి ఓటు వేస్తే వృథా

సంతబొమ్మాళి: ఓడిపోయే వైసీపీకి ఓటు వేస్తే వృథా అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం సాయంత్రం బోరుభద్రలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తీరప్రాంత కూడలి గ్రామమైన బోరుభద్ర అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేశానని, రానున్న రోజుల్లో మరింతగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు,రెడ్డి అప్పన్న, నేతలు వజ్జ ప్రభాకర్, అప్పిని వెంకటేష్, వల్లభ వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అసమర్థతతో ఆర్థిక స్థితి అతలాకుతలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్

ఆమదాలవలస: రాష్ట్రంలో ఒక్క అవకాశం పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ అసమర్థపాలనతో ఆర్థిక స్థితి అతలాకుతలమైందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఆమదాలవలస, శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థులు కూన రవికుమార్, గొండు శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి మూడో వార్డు ఊసవానిపేటలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. టీడీపీ హయాంలో ఆమదాలవలస మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు ఇంజరాపు విశ్వనాథం, మెండ దాసునాయుడు, సుజాత, చంద్రశేఖర్, గీతాసాగర్ తదితరులు పాల్గొన్నారు. 15, 13 వార్డుల్లోని గణేష్‌నగర్, విద్యానగర్ ప్రాంతాల్లో కూటమి అభ్యర్థి కూన రవికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కూటమి నాయకులు సూరపు నాయుడు, తమ్మినేని గీత, తమ్మినేని విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి: ఎమ్మెల్యే అశోక్



ఓటు కోరుతున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట: రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు కోరారు. సోంపేట పట్టణంలోని చిన్నపొందర వీధి, దగ్గుచెరువు గట్టువీధి, మహాదేవి పేట, కొండివీధి, మంగళవీధుల్లో శుక్రవారం సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, నేతలు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే పాలనలో ప్రజాసంక్షేమం: శంకర్



ప్రచారం నిర్వహిస్తున్న శంకర్

శ్రీకాకుళం రూరల్: దేశంలో ఎన్డీయే, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలోనే ప్రజా సంక్షేమం సాధ్యపడుతుందని శ్రీకాకుళం కూటమి టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. పెద్దగనగళ్లవానిపేటలో శుక్రవారం సర్పంచ్ బర్రి రామారావు ఆధ్వర్యంలో ప్రజాగళం, సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వ హించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయు డును గెలిపించాలని కోరారు. టీడీపీని గెలిపిస్తే మత్స్యకారుల ఆర్థిక సామాజిక ఎదుగుదలకు, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొండు జగన్నాధరావు, పీస రమణ, మైలపిల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు కలిశెట్టి పాదాభివందనం



రణస్థలం: 'అమ్మా నన్ను ఆశీర్వదించండి.. నా ఈ ఉన్నతికి మీరే కారణం'.. అంటూ విజయనగరం పార్లమెంటరీ టీడీపీ అభ్యర్థి కలిశెట్టి అప్పల నాయుడు పొలిట్‌బ్యూరో సభ్యురాలు ప్రతిభాభారతికి పాదాభివందనం చేశారు. శుక్రవారం విజయనగరం ఎంపీ టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు వెళ్లిన కలిశెట్టి మాజీ స్పీకర్ ప్రతిభాభారతిని కలిసి ఆమె ఆశీస్సులు తీసుకు న్నారు. ఆమె పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చిన అప్పలనాయుడుకు పొం దూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చేసిన ఘనత ఆమెదే. అప్పటి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన అప్పలనాయుడు ఎంపీ స్థానానికి పోటీచేసే స్థాయికి వచ్చారు. తన ఉన్నతికి కారణమైన ప్రతిభాభారతికి పాదాభివందనం చేయడం ఆనందంగా ఉందని అప్పలనాయుడు అన్నారు.

సతీమణుల ప్రచారం



ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం/గార: శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు సతీమణి శ్రావ్య, శ్రీకాకుళం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ సతీమణి స్వాతి శుక్రవారం శ్రీకాకుళం నగరంలో పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తు పట్టుకుని ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేపట్టారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అలాగే గార మండలం రాఘవాపురం, యాల్లపేట, పూసర్లపాడు గ్రామాల్లో శ్రీకాకుళం కూటమి అభ్యర్థి గొండు శంకర్ భార్య స్వాతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వజ్రపుకొత్తూరు నుంచి 40 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని పలాస ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. వజ్రపుకొత్తూరు పంచాయతీ నుంచి 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి శిరీష పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైసీపీ విధానాలతో విసుగు చెంది టీడీపీలో చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు శశిభూషణ్, ఉమామహేశ్వరరావు, నెయ్యల సూర్యనారాయణ, కుత్తం కృష్ణ, ఇప్పిలి గోవింద్ పాల్గొన్నారు. ● కొత్తపేట పంచాయతీ దిబ్బవానిపేటలో శుక్రవారం టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటిం టికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివ రిస్తూ తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పుచ్చ శోభారాణి, గోవిందు పాపారావు, పుచ్చ ఈశ్వర్రావు పాల్గొన్నారు.

ఎన్ఈఆర్ వెంటే మేమంతా..



పిట్టపాలెంలో ప్రచారం చేస్తున్న ఎన్ఈఆర్

రణస్థలం: ఎచ్చెర్ల కూటమి బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు వెంటే ఉండి, కమలం, సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపిస్తామని పిట్టపాలెం గ్రామస్థులు అన్నారు. శుక్రవారం ఆ గ్రామంలో ఎన్ఈఆర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పీఎంగా, చంద్రబాబు సీఎంగా అయితే దేశం, రాష్ట్రం అభివృద్ధి సాధిస్తాయన్నారు. స్థానిక పరిశ్రమల్లో యువతీ, యువకులకు ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు డీజీఎం ఆనందరావు, పిన్నింటి భాను, మజ్జి రమేష్, వండోదు, కెల్ల హేమంతు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన వైసీపీ నేతలు

రణస్థలం: లావేరు మండలం పెద్దలింగాలవలస సర్పంచ్, సీనియర్ వైసీపీ నేత లుకలాపు అప్పలనాయుడు అనుచరులు వట్టి సత్యంనారాయణ, గొర్లె రామినాయుడు, లంకలపల్లి మల్లేశ్వరరావు, మీసాల త్రినాథరావు తదితరులు బీజేపీలో చేరారు. వీరికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి రాజమండ్రి పార్టీ కార్యాలయంలో కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో పనిచేసే వారికి మంచి స్థానం ఉంటుందని ఆమె అన్నారు. ఎన్ఈఆర్ గెలుపునకు సైనికుల్లా పని చేస్తామని లుకలాపు అప్పలనాయుడు అన్నారు.

పటిష్ఠమైన భారత ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలి

పలాసరూరల్: బీజేపీ నియంతృత్వ పాలనను ఓడించి పటిష్ఠమైన భారత ప్రజా స్వామ్యాన్ని నిర్మించడమే తమ లక్ష్యమని సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు అన్నారు. బొడ్డ పాడు అమరవీరుల స్మారక మందిరం ఆవరణలో శుక్రవారం పార్టీ మేనిఫెస్టో విడుదల చేశారు. రాజ్యాంగం ఇచ్చిన ఓటును ప్రజా స్వామ్య పాలన అందించే పార్టీకి వేయాలన్నారు. కార్యక్ర మంలో సీపీఐఎంఎల్‌లిబరేషన్ అభ్యర్థి పోతనపల్లి కామేశ్వరరావు, తామాడ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్న వాహనం తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు వాహనాన్ని శుక్రవారం జాతీయ రహదారిపై హరిశ్చంద్రపురం వంతెన వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పరిశీలించింది. వాహనంలో ఎవరున్నది, ఏయే రకాల సామగ్రి తీసుకువెళుతున్నారు, ఇతర అంశాలను పరిశీలించారు. ఉప తహసీల్దార్ గురుదాస్ ప్రసాద్ బృందం ఈ తనిఖీలను చేపట్టింది.

బగ్గు నామినేషన్‌కు తరలిరండి

వెదుళ్లవలస(పోలాకి): నరసన్నపేట నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థిగా బగ్గు రమణమూర్తి శనివారం నామినేషన్ దాఖలు చేయనున్నారని, కార్యకర్తలు, నేతలు తరలి రావాలని టీడీపీ మండల నాయకులు ఎంవీ నాయుడు, పల్లి సూరిబాబు, రాంబాబు యందవ హరికృష్ణ కోరారు. ఉదయం 8 గంటలకు మబగాం గ్రామం నుంచి ర్యాలీ ప్రారంభమై నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయం వరకు సాగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు నామినేషన్ పత్రం ఆర్వోకి అందిస్తారన్నారు.

24న స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్

కొత్తూరు: పాతపట్నం నియోజకవర్గంనుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఈనెల 24న నామినేషన్ వేయనున్నానని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. నామినేషన్ కార్య క్రమానికి పెద్ద ఎత్తున తన అభిమానులు రావాలని కోరారు.

వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి

అరసవల్లి/పలాస: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13న ఓటు వేసేందుకు దుకాణాలు, సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని, ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఉప కార్మిక శాఖ కమిషనర్లు ప్రసాదరావు, విజయ్ కుమార్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కార్మికులు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా విని యోగించుకోవాలని కోరారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

పలాస: రాష్ట్ర, జిల్లా న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ లోక్‌అదాలత్‌ను మే 11న నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని పలాస ముస్సిఫ్ న్యాయాధికారి ఎస్‌హెచ్‌ఆర్టీ చక్రవర్తి కోరారు. ఈ మేరకు స్థానిక కోర్టు ఆవరణలో శుక్రవారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. క్రిమినల్ కేసులు పరిష్కారం చేసేందుకు కృషి చేయాలని కోరారు. న్యాయవాదులు ఎన్.విశ్వేశ్వరరావు, పిండి వెంకటరావు, వి.రవి పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకం

ఎచ్చెర్ల: జీవితంలో విద్యార్థి దశ కీలకమని బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో శుక్రవారం జరిగిన ఇంగ్లీష్ విభాగం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, బీవీ రమణమూర్తి, పి.రవికుమార్ పాల్గొన్నారు.